# అర్చిరాది - సార సంగ్రహము

## శ్రీ.ఉ।వే। శ్రీమాన్ తె.కం. గోపాలాచార్యస్వామి వారు

శ్రియఃపతియైన సర్వేశ్వరునకు ఉభయ విభూతులునూ యధేష్ట వినియోగార్హములై ఉండును. అందు భోగవిభూతియందున్న వారు ఆ సర్వేశ్వరుని యొక్క ఆజ్ఞను ఏకాతపత్రముగా శిరసావహించి ఆతని అభిమానమునకు పాత్రులై వర్తింతురు. లీలావిభూతియందున్నవారు శ్రియః పతి అభిప్రాయమును అనువర్తించువారు కాకుండ ఆతని సంకల్పమును అనుసరించువారై, వారివలె "నమః" అనుటకు బదులుగ "న నమేయం" (నే నౌకరికి వంగు వాడను కాను, నేనే ఈశ్వరుడను) అనుచును, వారివలె ఇతర దేవతలకు నమస్కరింపని ఉనికికి వ్యతిరేకముగ ఇతర దేవతలను పాడి ఆడు వారును, వారివలె మహాపురుషులై ఉండక స్వల్పులై ఉండువారును, వారివలె జ్ఞానముకలవారై ఉండక జ్ఞానహీనులై ఉండువారును, వారివలె తేజోమయమైన దివ్యమంగళ విగ్రహములతో ఉండక హేయములగు ప్రాకృత శరీరములతో ఉండువారును, వారివలె సర్వేశ్వరుని స్తుతించుటయే శీలముగా గలవారు కాక లోకమునందు నీచులను నుతించుచున్నవారును, వారివలె సర్వేశ్వరునకు సర్వవిధముల దాస్యమును చేయక కాముకులై సుందరీమణులగు స్త్రీలకు దాస్యము చేయువారును, వారివలె దాస్యమునకు తగునట్లు అలంకరించుకొని భగవద్గుణామృతపానమును జేయక స్త్రీల యొక్క యధరామృతమును పానము జేయువారును, వారివలె భగవంతుని కైంకర్యమునకై బహు శరీరముల ధరించక పుణ్యాపాపానుభవములకు ఎన్నియో శరీరములను

ధరించువారును, వారివలె పరమపదమున భగవంతుని ఆయుధములను మోసుకొనుచు ఆతనితో ఒక ప్రక్కగ సంచరించక శరీరేంద్రియములు చూపిన దారిన సంచరించువారును, "ప్రపన్నుని రక్షించుటయే నా వ్రతము" అను సర్వేశ్వరుని వ్రతమునకు వ్యతిరేకముగ ఉపాయాంతరములను తమపై పెట్టుకొని ఆతని చేతికి అందక పరుగెత్తు వారును అయి యున్నారు.

ఇట్లు అల్ప సారములును, ఆనిత్యములునైన శబ్దాదివిషయములను ఆస్వాదించి తన నెడబాసి పోవలసిన సంసారి చేతనుల నీచతను జూచి వీరితో తనకుగల స్వాభావిక సంబంధమే హేతువుగ విడువ జాలక, వీరిని చక్కబరచుటకై అనేకములగు అవతారములను ఎత్తి తిరుగుచున్న సర్వభూతసుహృత్తగు సర్వేశ్వరునియొక్క యత్నవిశేషము ఒకానొక నాడు, ఒకానొక అవకాశ మందు, ఒకానొక చేతనునియందు ఫలించును.

అంత ఆ చేతనుడు భగవద్భాగవత విషయమై అద్వేషసంకల్పము గలవాడై మోక్షమున అపేక్షకలవాడై వైరాగ్యముతో ప్రవర్తించుచుండును.

అంత కొంత కాలమునకు ఆ యభినివేశము పక్వమై సదాచార్య సమాశ్రయణమును గావించును. భగవత్ప్రీతికర వ్యాపారములను జేయును, సంసారముయొక్క క్రౌర్యము ననుసంధించును. అంత ఆతడు పాము నోటబడిన కప్ప వలెను, కారు చిచ్చు కబళీకరించిన ఆడ లేడివలెను, రెండు ప్రక్కలను ప్రజ్వలించుచున్న కొరకంచునకు మధ్యనున్న చీమవలెను, తరంగించుచున్న సముద్రమున మునిగిపోవుచున్న ఓడయందున్న వాని వలెను "ఓ శ్రియఃపతీ! నా కిపుడు తోడుపడు వారెవ్వరు? ఇంకను అనేక శబ్దాదివిషయములను కనబఱచి సంసారములో పడవైచెదవా? ఇంకను చెడగొట్టెదవా? అయ్యో! పంచేంద్రియములు శత్రువుల వలె



ప్రతి దిక్కునకును బలాత్కారముగ లాగి పడవైచుచున్నవి, తిండిని బట్టను తెమ్మని బాధించుచున్నవి. విడువకున్నవి" అని ఇంద్రియముల క్రౌర్యమును తలచి మొరపెట్టును.

"అయ్యో! తలంచుటకు శక్యముగాని దుఃఖములను ఫలింప జేసెడి ఇవి ఏమి లోక స్వభావములు? ప్రాణము నశించుటను జూచిన సహింపజాలను" అని సంసారుల యొక్క నష్టమునకును నొచ్చుకొని సహింపజాలక పిరాట్టికి రాక్షసస్త్రీలతో సహవాసము అసహ్యమగునట్లు పిచ్చి వారైన లోకమునందలి మనుష్యులతో సహవాసము నాకు దుశ్శకము, సర్వేశ్వరుని ధ్యానమునుండి విముఖులై తిండిని బట్టను మాత్రమే పురుషార్థముగ భావించి పరుగెత్తుచున్న వీరితోడి సహవాసము నాకు దుస్సహము, ఈ స్వభావమును ఇక నేను పొందకుండ జేయుము. "నేను నిన్ను ఎక్కడ పొందెదను? అట్లు పొందెడి దినము ఎప్పటికి? నేనా పరమపదము నెప్పటికి చేరగలను? ఇక నేను ధరింపజాలను, నీవు నన్ను పిలుచుకొను కాల మింకను నమీపించదా తండ్రీ" అని భగవదనుభవము లభింపకుండుటచే గొప్ప తృష్ణను పొందును. నిప్పుతో చేరిన మైనమువలె కరుగుచు "నేను సేవించునట్లుగా వేంచేయు" మని పిలచి పిలచి అట్లు లభింపక "స్వామీ! ఒక పగలు వేయి కల్పము లగుచున్నది. కృతకృత్యుడనై మృత్యువును ప్రియ బంధునివలె ప్రతీక్షించుచున్నా" నని శరీరమును విడచు సమయము నభిలషించును. భార్య యొక్క యుచ్ఛిష్టము ఆదరించు రాజపుత్రుని వలె తానింత వరకు ఆదరించి హేయమని విడచిన తన దేహమును ఆదరించుచున్న సర్వేశ్వరుని జూచి "ఈ దేహము నశించుటకు సమ్మతించు" మని అపేక్షించును. నా ఆత్మాత్మీయములను ఇంత వరకు

లీలగా అనుభవించితిని, ఇక నా అనుభవమును విడువుము, ఇక నేను నిన్ను విడచి పోవుట కొప్పుకొనను. లక్ష్మీదేవి తోడు, నీతోడు" అని ఒట్టు పెట్టుకొని నిర్బంధించును.

ఇట్లు పరభక్తి తలయెత్తగా "నేను నా భక్తుని మరణకాలమున స్మరించి పరమపదమునకు గొనిపోవుదును" అనియు, "నే నవతరించినది సాధు రక్షణము కొరకై" అనియు చేసిన ప్రతిజ్ఞను కాపాడుకొనుము. ఇట్లు విలక్షణముగా స్తోత్రమును జేసి సదాచార్య సమాశ్రయణమును గావించి శరీరావసానకాలము దగ్గరకు రాగా సర్వేశ్వరుడు తన తిరువడిఘళ్ల యందు వీడు తలవంచిన నాడు మొదలుకొని వీడు చేయునది అంతయు వడ్డీతో పెరిగిన ఋణమువలె తలంచి ప్రత్యుపకారమును వెదకి తల్లడిల్లు చుండును. వీనిని దిద్ది నిత్య కైంకర్యమును స్వీకరించదలంచి కోరలు తీసిన పామువలె సంసార మనువర్తించని విధముగ పరమపదమునకు తీసికొనిపోవుటకు త్వరపడును. ఈ చేతనుని తృష్ణ గోష్పదమో యను నటుల ఆ శ్రియఃపతి తృష్ణ పెరుగును. దశరథ చక్రవర్తి, శ్రీరామ చంద్రుల పట్టాభిషేకమునకు వసిష్ఠ వామ దేవాదుల పిలిపించి ప్రయత్నించినట్లు నిత్యసూరులను పిలిపించి మార్గమును అలంకరింపజేయును. పరమపదము నలంకరింప జేయును. వీని పూర్వోత్త రాఘములను వరుణుని గురించి సంధించిన బాణమును మరు కాంతార మందున్న రాక్షసులపై విడచినట్లు శత్రుమిత్రులయందు ఆరోపించును. వీనితో సంబంధము కలవారై నరకానుభవమును చేయుచున్నవారిని స్వర్గమందుండు వారినిగ సంకల్పించును, దయాసముద్రుడైన గరుత్మంతుని అధిరోహించి, మా వీధి గుండా నడిపించి దర్శన మిమ్మా యని వీడు ఆశ పడిన ప్రకారముగ



గరుత్మంతు నెక్కి వచ్చి మేరుపర్వతముపై విజృంభించిన గొప్ప మేఘమువలె దర్శన మిచ్చును. తన తిరుమేనిని సంపూర్ణముగ ననుభవింపజేయును, ఆతివాహకులను పిలచి కృపజేసి వీనిని సత్కరించు క్రమముగ సత్కరించుటకు ఆదేశించును.

అటు పిమ్మట ఉపనిషత్తులలో ఉత్క్రమణ దశను వర్ణించినట్లు బాహ్యేంద్రియములు అంతఃకరణముతోను, అంతఃకరణము ప్రాణముతోను, ప్రాణము ఈ చేతనునితోను చేరును. అంత నీ చేతనుడు సూక్ష్మ శరీర ధారియై పరమాత్మపట్ల జేరును. పిమ్మట గ్రీష్మకాలమునందు సూక్ష్మకిరణములచే తపింపజేయబడినవాడు నీడగల వృక్షము నాశ్రయించి శ్రమను తీర్చుకొనునటులు తాపత్రయముచే సంతప్తుడగు ఈ చేతనుడు వాసుదేవు డనెడు వృక్షముయొక్క నీడను సమీపించి విశ్రమించును. తిరుక్కోవలూరునకు వేంచేయునపుడు తిరుమంగై యాళ్వారులకు మార్గమధ్యమందున్న దివ్య దేశములలోని శ్రియఃపతి చరణారవిన్దములును, ద్వయమంత్రానుసంధానమును దారి బత్తెమైనట్లును, ముక్తి మార్గమును కోరుచున్నవారందరును అర్చిరాది మార్గమున ఏగుదురన్నట్లు అర్చిరాది మార్గమే పెద్ద మార్గముగాను, బ్రహ్మాండమున కవ్వలకు గొనిపోయి ఉజ్జీవింప జేయు స్వామి గాన మిక్కిలి ఆప్తుడును, శేషశాయియును, కుటిలాలక కేశపాశుడును, పుండరీక దళామలాయ తాక్షుడును, ప్రవాళాధరుడును, కాలమేఘ నిభుడును, శ్రీరంగ నిత్యవాసియు ఐన శ్రియఃపతియే దారికి తోడుగా ఏర్పడును. విరజానదీ తీరమున్ను తిల్లె వృక్షమున్న ఐరంమ్మద సర స్తీరమున్ను, విశ్రమస్థలములుగా నుండును, తిరుమామణిమంటపమే ప్రవేశస్థలముగా నుండును. అర్చిరాదులను దారిని

చూపు పురుషులే సల్లాపమునకు తోడుగా నుందురు, వ్యాప్తమైన ఆకాశమునకు అలంకారముగ నుండు మేఘముల ధ్వనియే ప్రయాణ పటహధ్వనిగా ఉండును. హృదయమందున్న సర్వేశ్వరుడు వెలుగు నిచ్చి మార్గమున సంచరించునట్లు కృప చేయగా ఈ ముక్తుడు పరమపదమునకు వెళ్ళుటకు ఉద్యోగించును. అనాది కాలము తనను దాసునిగా చేసుకొని వచ్చిన సంసారమును వెనుకకు తిరిగి చూచి నవ్వును.

పరమాకాశమందున్న పరమపదమును సేవించుటకు పూర్వమునుండియు నున్న యాశ పొంగి పైకివచ్చి పైపైగా వృద్ధిపొందగా సీతాపిరాట్టియును, శ్రీవిభీషణాళ్వానును లంకలో నుండి బయలుదేరినట్లు హృదయకమలము నుండి బయలుదేరి హృదయమునందున్న నూటయొక్క నాడులలో "సుషుమ్న" యను పేరుగల శిరఃప్రదేశమునందున్న నాడియందు విద్యామాహాత్మ్యముచేతను నిరంతరము అర్చిరాది మార్గచింతన చేతను ప్రసన్నుడైన హృదయమందున్న సర్వేశ్వరుడు, చేతదీపమును పట్టుకొని ముందుపోగా ఈతడు పోయి శిరః కపాలమును భేదించి యానాడి సూర్యమండలము వరకు నుండును గాన దాని ద్వారా నా సూర్యరశ్ములచేత ఊర్ధ్వముగా గొనిపోబడి సూర్యరశ్మిని అనుసరించును.

ఆ పోవుటలో ప్రణవము అను రథము నెక్కి మనస్సు సారధ్యము చేయగా పోవునపుడు ఉభయవిభూతులును నూతన శోభను వహించును. సముద్రము తన గాంభీర్యమునంతను వీడి క్రిందనున్న మన్నును మీదకు విసరి వేయునో అను సంభ్రమ నృత్తముచే ధ్వనిజేయును. ఊర్ధ్వ లోకములయందున్న వారందరును కానుకలు చేతులయందుంచుకొని ఆకాశము నందు అంతటను పూర్ణకుంభములచే పూర్ణముగా చేసి



ధూపములతో కూడ పుష్పవర్షమును వర్షించి ఈ ముక్త పురుషుడొకసారి బసచేసి పోవునా యను నాశచే నెదురెదురుగా మార్గమునందు విడుదుల నేర్పరతురు. లోకము లన్నియు నదురునట్లు సముద్రఘోషము వలె వాద్యము లంతటను ప్రాయగ మార్గస్థు లందరును "రండు, మా స్థానములను ప్రవేశించండి" అనుచు తమ తమ స్థానములను తమ ఐశ్వర్యములను సమర్పింతురు. కాంతిగల సుందరమైన నేత్రములు గల ఆతివాహికుల భార్యలు "ఈ స్థలము అరాజకమై పడి యుండదగునా? దీని నేలుకొను" డని మంగళా శాసనములను చేయుదురు, మరుత్తులును వసువులును యీ ముక్తపురుషుడు త్వరపడి పోగా సర్వేశ్వరుడు మనకు అధీనమును గావించిన స్థలములను గడచిపోయినాడని ఊరకుండక లోకాంతరములకు కూడ వెంబడించి వెళ్ళి ఈతనికి వినబడునటుల స్తోత్రములను చేయుదురు, మిగిలినవారందఱును నమస్కరించుచుండగా గొప్ప సత్కారములతో గూడ పోవునపుడు ఛాందోగ్య, వాజసనేయ, కౌషీతకీ మొదలగు ఉపనిషత్తు లందు చెప్పుచున్న ప్రకారముగ ఆయా లోకాధిపతులగు అర్చిరాది పురుషులు ముందు నడచుచు మార్గమును చూపింపగా పోవుచుండును.

## 2

ఆ అర్చిరాదులలో ముందు అర్చిః పురుషుని సమీపించి యాతడు కొంతదూరము మార్గము నందు నడిపింపగా పిమ్మట అహా! పురుషుని, శుక్లపక్షాభిమానిని, ఉత్తరాయణాభిమానిని, సంవత్సరాభిమానిని, వాయువును సమీపించి వారు దారిని చూపింపగా సూర్యుని ప్రవేశించి, ఎదురుగా చూచుటకు శక్యము కానట్లు నిరవధికమైన తేజస్సుతో ఇతడు

వేఱొక సూర్యుడో అనునట్లుగ వెళ్ళి ఆ మండలమును భేదించుకొని, గ్రహ నక్షత్ర తారకలకు నిర్వాహకుడై అమృత స్వరూపుడై ఉండు చంద్రుని సమీపించి యాతడు సత్కరింపగా పైగా పోయి అమానవుని సమీపించును. అతడు మార్గదర్శకుడై నడిపింపగా నందరకు నాప్యాయనమును కలిగించువాడైన వరుణుడును, త్రైలోక్యపాలకుడైన దేవేంద్రుడును, దేవత లందఱకును నిర్వాహకుడైన ప్రజాపతియును నాదరించుచుండగా ఆయా లోకముల కేగును. పిమ్మట వారి లోకములను గూడ దాటి బ్రహ్మాండము నున్ను, దశోత్తర విస్తృతమైన ఆవరణ సప్తకమును, మూలప్రకృతినిన్ని దాటిపోవుచుండును.

పూర్వము సంసారిగా నుండు దినములలో పుత్రదారాదిమయమైన పాశములచే గట్టబడి, చివరిదశలో యమదూతలచే లాగబడి, అంధకారావృతమై నీరును, నీడను లేని లోకమున వినినంతనే వణకిపోవలసిన క్రూరమైన మార్గమునందు శునకములు తొడలయందు కరచుచుండగా, యమదూతల శక్తి శంఖుతోమర బాణ శూలాది ఆయుధములచే బాధపడి, వ్యాఘ్రముల వంటి రాక్షసుల నోళ్ళకు ఆహారమై, శరీరమంతయును రక్తము, చీమును కారుచుండగా, వానినే ఆకలి దాహ శాంతులకై త్రాగుచు, ముక్కు, ముఖము, దౌడలు పళ్లు చితికిపోయి, చేతులును, కాళ్లును ఊడిపోవునటుల ఈడ్వబడి మొఱపెట్టుకొనుచు పోయిన దుఃఖమంతయు పోవునట్లుగ, సుఖోత్తరమైన ఈ అర్చిరాది మార్గమున నడుగిడినది మొదలుగ చూచినవారందరును సత్కరించుచుండ శీఘ్ర గమనమున పోవుచుండును.



ఇంతకు పూర్వము శబ్దస్పరాదులనబడుచున్న సింహవ్యాఘ్రాదులకు దప్పి సంసారమనబడు పెద్ద తుప్పలో నుండి బయటపడి తాపత్రయము లనబడు కారు చిచ్చునందు పడిన క్లేశమంతయు తీరునట్లు ఇపుడు వైతరిణికి ప్రతికోటయగు విరజానదిని సమీపించును.

వాసనారేణ్వవకుంఠితమై, మేఘావృతమైన సూర్యమండలము వలెను, రాహుగ్రస్త చంద్రమండలమువలెను, బురదలో పడిన మాణిక్యమువలెను ఉన్న నీ ముక్తుడు విరజానది నీటియొక్క స్పర్శ చేత మాత్రమే ఆ సూక్ష్మశరీరమును గూడ బాసి అనేక వేల సూర్యులు చేరి ఉదయించినట్లు కంటితో చూడ శక్యముగాని ప్రకారముగ నిరవధిక తేజస్సు కలవాడగును.

నాలుగు భుజములు కలవాడై, శంఖ చక్ర గదాధరుడై విరజా నదీతీరమున ఈతని రాకకై వేచియున్న అమానవుని సమీపించును. ఆ అమానవుడు ఈతనిని తన శ్రీహస్తముతో స్పృశించగా లావణ్య సౌందర్యాది కల్యాణగుణములకు ఆకరమై శుద్ధ సత్త్వమయమై, భగవదనుభవైక పరికరమగు శరీరమును ధరించును.

ఇంద్రాది పదవులవలె కర్మసాధ్యమును నశ్వరమును గుణత్రయాత్మకమును నై యుండక భగవత్ప్రీతిసాధ్యమై నిత్యమై శుద్ధ సత్త్వాత్మకమై ఆనందమునకు అంతము లేనిదై జ్ఞానమును కలుగజేయునట్టియు, సనకాదులయొక్క మనస్సునకు గూడ గోచరము కానిదియు, భగవదానుకూల్యమే భోగముగా గల నిత్య సూరులచే సాంద్రమై, వారిచేతను గూడ పరిచ్ఛేదింప శక్యముకాని పరిణామమును, ఐశ్వర్యమును, స్వభావమును కలదైన దివ్య దేశమును సందర్శించి నమస్కరించును.

అనుగమించు అమానవపురుషుడు గావించిన శంఖ కాహళ భేరీ ధ్వనులను విని యిచ్చట నుండువా రందరును పరుగెత్తువారుగను, పడుచు లేచుచు నుండువారుగను, సంతోషించు వారు ఆలకించువారుగను, ఎచ్చట నెచ్చట యని వెతుకువారును, కంటికి భోగ్యమైన దృశ్యమును చూచితిమి చూచితిమని పెద్ద ఆరవారమును చేయుచూ సంఘములుగా బయలుదేరి తన కభిముఖముగా వేంచేయుచున్న నిత్యముక్తుల యొక్క ఆనంద కలకలమును గాంచి యనుభవించుచు పెద్ద ప్రీతితో గూడ పోవుచుండును.

భగవద్భుక్త శేషములగు దివ్యమాల్యములను, దివ్యాంజనమును, దివ్యచూర్ణమును, దివ్యవస్త్రములను, దివ్యాభరణములు మున్నగు వానిని ధరించి, అయిదు వందల దివ్యాప్సరసలున్ను, నిత్యసూరులున్ను ఎదురుగా వచ్చి బ్రహ్మాలంకారముచే ఈతని అలంకరింతురు. ఈ అలంకారములతో ఒప్పుచున్న ముక్తుని ఇచ్చటివారు “ఆహా! ఈ ఆభరణముల యొక్క అలంకార మేమి? ఆ బట్ట కట్టేమి? ఆ నూతనమైన శోభ మనకు తలంప తగిన స్వభావము కలదా?” అని ఆశ్చర్యముతో కొనియాడు చుందురు.

పిమ్మట అనేక వేల ధ్వజములచేతను, ముత్యముల సరములచేతను, మేలుకట్ల చేతను అలంకరించబడినదై, దివ్య స్త్రీలచే చుట్టువారు కొనబడినదై, భగవంతుని సంకల్పముచే కల్పింప బడినదైన ఒక దివ్యవిమానమును గరుడాళ్వారులు తీసికొని వత్తురు. దానియందు ఇతని నెక్కించుకొని స్తోత్రమును జేయును. తిల్యకాంతారము వరకు వెళ్ళగనే నానావిధమైన ఉపహారములను ధరించుకొని వేఉగ కొందరప్సరసలు ఎదురుగ వచ్చి స్తోత్రము చేసి సత్కరింతురు.



తరువాత తిల్యగంధము బ్రహ్మగంధము మొదలైన అప్రాకృతమైన గంధములను ఆఘ్రాణించుచు సర్వగంధుడై ధ్వజపతాకాదులచే అలంకరింపబడిన దివ్యగోపురమును సమీపించును. ద్వారములను గాచెడు పెద్దలు “మీరు వైకుంఠనాథుని దాసులైరి, కావున మీరు మా వారే, మా అధికారములందు ప్రవేశించుడు” అనుచు గొప్ప ఆదరముతో సత్కరింతురు. అంత నీ చేతనుడు అట్టి జనులచే నిండిన ఆ ద్వారమును దాటి మనోనేత్రములను అతి ప్రయత్నముతో మరలించుకొని “అయోధ్య” యనియు “అపరాజిత” అని జెప్పబడుచున్న శ్రీ వైకుంఠ మనెడు దివ్య నగరమును ప్రవేశించి నమస్కరించును. వైకుంఠమునందలి కైంకర్యనిష్ఠులును గుణనిష్ఠులున్ను “సముద్రజలము సహ్యపర్వతమునందెక్కి తరంగించునట్లు సంసారము నందున్న ఈతడు ఈ దేశమునకు వచ్చునట్లు లభించినదే” అని ఆశ్చర్యమును పొందినవారై కొనియాడుదురు.

పిమ్మట ప్రత్యేక ప్రాసాదములు గల గరుడాళ్వార్లు, విష్వక్సేనులు మొదలగువారు తమ తమ గృహములకు తీసికొని వెళ్ళి, వీని నొక ఉన్నతాసనమునందుంచి తమరు భూమియందు కూచొని తమ భార్యలు నీరు పోయగా శ్రీపాదములను కడిగి తమ భార్యలకు వీరి ప్రభావమును జెప్పి సత్కరించవలసినరీతిగా సత్కరింతురు. తరువాత శ్రీ శఠకోపమును, శ్రీచూర్ణములను, పూర్ణకుంభములను, మంగళదీపములనున్ను ధరించుకొని దేశాంతరగతుడై వచ్చిన పుత్రుని జూచిన తల్లులవలె చల్లని ముఖములు గల యువతులు వచ్చి ఎదుర్కొనగా పెద్ద వీధి మార్గమున లోపల ప్రవేశించి దివ్యమైన ఆవరణ శతసహస్రములచే నావృతమై మేలిమి బంగారముచే చేయబడిన కోయిలను సమీపించి “శ్రీ వైకుంఠాయ దివ్యవిమానాయ నమః” అని దండము పెట్టును.

ఒక మడికట్టు వర్షము పడినట్లు తన రాకచే చిగిర్చి పుష్పించిన సురపొన్న వృక్షము యొక్క నానావిధ వర్ణములును గంధములును గల అప్రాకృత పుష్పములచే సాంద్రమై మకరందమును ప్రవహించుచున్న కల్పవృక్షముల తోటలతోను నానావిధములైన పుష్పములతోను, నానావిధ రత్నములతోను నేర్పరచబడిన లీలామంటపములచేతను, ఆశ్చర్యజనకములైన క్రీడాపర్వతముల చేతను, శ్రీవైకుంఠనాథునకును పిరాట్టిమారులకును లీలాపరికరములై చెవులు గింగురుమనునట్లుగా భోగ్యములైన పలుకులు గల చిలుకలు, గోరువంకలు, నెమళ్ళు, కోకిలలు మొదలగువానిచే వ్యాకులములై, మాణిక్యములు, ముత్యములు, పగడములు మొదలగు వానిచే నేర్పరుపబడిన మెట్లు కలదియు, నిత్యముక్తుల యొక్క హృదయములవలె చల్లనై స్వచ్ఛమై అమృతరసమయములైన జలములచే నిండినదై, నానావిధములైన పక్షిసంఘములచే వ్యాప్తమై త్రుళ్ళి అంతటను స్రవించుచున్న మకరంద ప్రవాహము కలదై, సుందర స్త్రీల యొక్క ముఖములకును, నేత్రములకును సదృశమైన తామరలు ఎఱ్ఱకలువలు మొదలైన అప్రాకృత పుష్పములుగల సముద్రములువలె దీర్ఘమైన తటాకముల చేతను, నానావిధ పుష్పపర్యంకముల చేతను. పుష్పముల యందవగాహించి మకరంద ప్రవాహమున మునిగి పాటలచే ననుమానింప వలసిన దైవభృంగముల యొక్క దివ్య గాంధర్వములచేతను, సమీపించిన వారిని మైమరపించుచున్న దివ్యోద్యాన శతసహస్రముల చేతను చుట్టువారు కొనబడి, నానారత్నములచే నేర్పరుపబడిన స్థలములుకలదై, అనేకవేల రత్న స్తంభములచే నలంకృతమై, ఉభయవిభూతులందున్న వారును ఒక మూల నిమిడిపోవునంత వైశాల్యము కలదై, తామరపువ్వులు, ఎఱ్ఱ కలువలు, చందనము, అగరు, కర్పూరము మొదలైనవానిని కలుపుకొని వచ్చుచున్న



మందమారుతముచే సేవింపబడుచున్నదై, నిరతిశయానందమయమై విరాజిల్లుచున్న తిరుమామణి మంటపమును సమీపించును.

**"ఆనందమయాయ మణిమంటప రత్నాయ నమః"** అని దానికి నమస్కరించును. అపరిచ్ఛిన్నమైన రసస్వరూపుడగు భగవంతుని ఎల్లప్పుడు ఆనుభవించుటచే బాల్యమును పొంది వైకుంఠ నాథునితో సామ్యమును పొందినవారై తదనుభవముచే ఉత్పన్నమైన సంతోషాధిక్యమును లోన నిముడ్చుకొనజాలక బైటకు త్రోవబెట్టి నట్లు సామగానము చేయువారును, అట్టి ఆనంద ప్రవాహమునందు కొట్టుకొనిపోకుండగ సౌశీల్య మనెడు నవలంబన స్తంభమును నాటువారును, అచట వేంచేసియున్న తమ ఆచార్యులను గూర్చి "ఆచార్యా! ఆభరణములచే గలిగిన తేజముతో విరాజిల్లుచు పుండరీకదళామలాయ తేక్షణుడగు ఉపకారకుడైన శ్రియః పతిని కనబరచితిరిగదా" అనువారును, "సమీపించితిని అని సంతోషించి కైంకర్యమును జేసి నీపాదములను పొందితిని మా స్వామి! ఇదియే ఇంకనూ కావలెను" అను వారును, "నా నీచత్వమును చూడక నా మనస్సునందు కలసిన వాని సౌశీల్యమును నే నెట్లు చెప్పవలెనో ఎఱుంగను, ఏమని చెప్పుదును? మీరే చెప్పుడు" అనువారును, "నమో నారాయణాయ" అనువారును, విచ్ఛేదము లేకుండ జెప్పదగిన పెరియతిరుమంత్రము ననుసంధించువారును, ఆత్మసమర్పణము చేయువారును, "ప్రబలమైన పాపములు గల నన్ను చీల్చివేయుచున్న గుణములు కలవాడా" అని శరహతులవలె శ్రమపడు వారును, దాస్యరసము ఉన్మస్తకమై "నమః, నమః" యని చెప్పువారును నగుచుందురు. ఈ ప్రకారముగ ప్రళయసముద్రమందు అల్లాడువారువలె, ఆనంద సముద్రమందు

అల్లాడి నిత్యముక్తులు చెప్పుచున్న చెవులకు భోగ్యములై ఋజువులైన శబ్దములను వినుట చేత ఇంతకు పూర్వము సంసారమున క్రూరమైన మాటలు గలవారి కఠినమైన మాటలను వినిన కష్టము తీరునట్లుగా చెవికి ఆహారమును పెట్టుకొనుచు పోయి దివ్యా స్థానమును సమీపింతురు.

ఆ మహాసభ యొక్క మధ్యను తమ కిరీటములయందు తమకు అసాధారణములగు దివ్యాయుధ చిహ్నలను ధరించి జోడించిన చేతులతో నున్న అస్త్రశస్త్రము లనెడి పేరులు గలవారై ఉన్న దివ్యపురుషులను, తమ యొక్క సంకల్పముచే సృష్టి స్థితి సంహారములు చేయగల సేనై ముదలియార్ (విష్వక్సేనులు) మొదలైన దివ్యపురుషులను మర్యాదను తప్పక క్రమముగ సేవించి ఉందురు.

## 3

ఉభయ విభూతులును చిత్తరువులుగా ఏర్పఱచబడి సర్వాశ్చర్య కరమైన శిల్పములు గల శ్లాఘ్యమైన సింహాసన మొకటి ఉండును. దానిపై పన్నెండు రేకులు కల నానాశక్తిమయమైన దివ్యకమలము ఒకటి ఉండును. దాని దివ్యకర్ణికయందు పుష్పసమూహముచేత విచిత్రమైన దివ్యయోగ పర్యంకము ఒకటి ఉండును. దానిపైన అనేక వేల చంద్రులను కరగించి పోసినట్లు చల్లని కాంతిగలదైన తిరుమేని గలవాడై కల్యాణ గుణముల కంతము లేకపోవుటచే తన సర్వవిధ కైంకర్యముల యందును పూనుకొన్నవాడై, కైంకర్యపరులందరకును ఉపమానమై యుండుటచేతను అనంతుడనియు, తిరునామముగల ఆదిశేషుడు అమరియుండును. ఆయనకు భగవదను భవమును వెలిబుచ్చుట కనేకమైన నోళ్ళును



తలలును గలవు. ఆయన విజ్ఞాన బలములకును, శైత్య, మార్దవ, సౌరభ్యాది గుణములకును పాత్రమైనవారు.

అట్టి తిరువనన్తాళ్వాన్ అనబడు పడకయందు వెండి కొండ శిఖర మందు అనేక వేల సూర్యులు చేరి ఉదయించినట్లు ఉన్న ఫణామండలముల యందలి జ్యోతిర్మండలము యొక్క మధ్యను, ప్రపంచమునకు అధిపతిని కూడ తన పూర్తి చేతనే పూర్ణునిగా జేయదగిన పూర్తిని, పరిమళమునకు గూడ పరిమళము నొసంగు సుందరమైన కేశపాశమును, పుండరీకాక్షుని కూడ తనకు విధేయుడై తన సౌందర్యమున నుక్కిరిబిక్కిరిచేసి తనయందు మగ్నుని చేయదగిన సౌందర్యమును, కాంతియును గల విశాలమైన నేత్రములను, భోగమునకు అవశ్యాపేక్షితమైన అలంకారములవలె బాల్యయౌవనముల మధ్య యందున్న యౌవనమును, నోటిలో చెప్పినంతమాత్రముచేతనే కందిపోవునంత సౌకుమార్యమును గల చల్లని పద్మవాసినియగు లక్ష్మీదేవి యందు మిగిలిన దేవులయందు వలె శాస్త్రము ననుసరించి ప్రవర్తించ నీయని భోగ్యతా ప్రకర్షను కలిగియుండి, భోగారంభ క్రీడయందే భగవంతుని విశ్వరూపమును సంకోచింపజేయు మహిమ కలదియై, దివ్య పరిజనులను ఆయా అవస్థలకు అనురూపముగ దివ్యపరిచర్యలయందు నియోగించు చున్నదియై సమస్తాత్మలకును ఎప్పుడును సమానముగ ఆశ్రయణీయయై శీల రూప గుణ విలాసాదులచేత భగవంతునకు తగియున్న పెరియపిరాట్టిమారు (లక్ష్మీదేవి) కుడి ప్రక్క యందు వేంచేసి ఉండగా, ఆమెను మించిన క్షమా దయాదిగుణములను నోటితో చెప్ప శక్యముగాని సౌందర్యమున్ను గలవారై ఆ లక్ష్మీదేవికి నీడ వలె నుండు మిగిలిన యిద్దరు నాచ్చియారులును ఎడమప్రక్కయందు

సేవించి ఉండగా, వీరికి మధ్యను మూడు మెరుపు తీగలతో కూడి తామరలను పూచినదైన ఒక నల్లని మేఘము వెండికొండపై కబళీకరించినట్లుగా అవగాహించినట్లు తిరుముఖ మండల కాంతిప్రవాహ మూర్ధ్వముఖముగా ప్రవహించినదో అనునట్లుండి ఉభయ విభూతులకును నిర్వాహకుడనెడు అంశమును సూచింపదగినదై తన కాంతిచే ఇతర కాంతుల నన్నింటిని మూసివేయుచున్న పరమపదనాథుని దీర్ఘమైన కిరీటమునున్ను, చూచువారి నేత్రములను, మనస్సును చీకటి క్రమ్మునట్లుగా చేయు నల్లని ఉంగరములుగా జుట్టుకొనినట్టియు, అష్టమి చంద్రునినుండి అమృతధార పడుచున్నటులవలె ఫాలభాగమున ధరించిన పుండ్రము నొకతరి కప్పుచు నొకతరి విప్పుచు చలించుచున్న వికసించిన పుష్పములుగల చల్లనైన తులసి పరిమళములుగల నల్లని చల్లని పొడవైన కుంతలములును, సౌకుమార్యాతిశయముచే చిరి చెమటను చెమర్చినటుల ఆశపడినవారిని బంధించు స్థాన మనదగిన ఫాలభాగమును, వికసించి నల్లనైయున్న రెండు తామర పుష్పములను మదముచే అణచి ఆడుచున్న రెండు తుమ్మెద పంక్తుల వలెనుండు శార్ఙ్గమను ధనువువలె వంగియున్న సుందరమైన కను బొమలును, సంశ్లేషించిన వారికి రెండు మృత్యువులై మిగిలిన వారిని తల్లి వలె రక్షించునవియై, చేతనులపట్ల వాత్సల్యాతిశయము చేతను పిరాట్టి నిరంతర కటాక్షముచేతను ఉభయవిభూత్యైశ్వర్యముచేతను ఎఱ్ఱనై "పతిం విశ్వస్య" అను ప్రమాణ మవసరము లేకయే అతడు సమస్త లోకముల నేలుచున్న యరవిందలోచను డనునట్లు సర్వేశ్వరత్వ చిహ్నమై వేరొక సౌందర్యానుభవమునకు వెళ్ళనీయక తనకే అనన్యార్హ మగునట్లు చేయుచూ త్రిపాద్విభూతిని కూడ తనకు స్వాధీన మగునట్లు చేయునట్టియు పరస్పరము స్పర్ధకలవగుటచే త్రుళ్ళిపడుచున్న మత్స్యద్వంద్వములవలె



మనోహరములై దూత కృత్యములను చేయు నేత్రములును, ఉన్నతమైన కల్పవృక్షము యొక్క లతయో, చిగురో అని సందేహమును బుట్టించు సుందరమైన ముక్కును, దాని యొక్క చిగుళ్ళయందు ఉదయించు చున్నట్లున్న దివ్యగండస్థలమున్ను దానియొక్క నూతనమైన పుష్పములో అనునట్టున్ను, ఆణిముత్యముల కాంతి వ్యాపించునట్లున్ను, పూర్ణచంద్రుడు పరిపూర్ణమగు వెన్నెలను ప్రసరింపజేయునట్లు నున్న దంతకాంతిని ప్రసరించు మందహాసమున్ను, సౌందర్యమునకు ఆకరమై పగడమువలె స్నిగ్ధమై దానినుండి బయలు వెడలు మాటలను వినవలెనను ఆసక్తినికూడ పుట్టనీయక దానిని చూచినంతనే మనస్సునుకూడ హరించునట్టి చాటు భాషణముల కాకరమైన దివ్యాధరమున్ను, ఆత్యుజ్వలమై ప్రీత్యతిశయముచే పుట్టు శిరఃకంపముచే చలించి దిగంతములకు వ్యాపించు కాంతులను వెదజల్లుచున్న మణిఖచితములగు మకరకుండలములును, సకల కళా పరిపూర్ణమై సర్వాహ్లాదకరమై కళంకరహితమైయున్న చంద్రమండలమును, అప్పుడు వికసించిన ఎఱ్ఱతామరపుష్పములను అధఃకరించి చూచినవారిని వ్యామోహింపచేయుచు తన కాంతియే తనకు ఆభరణముగా గల సుందరమగు ముఖమును, దేవిమారుల యొక్క హస్తా భరణముల చేతను, ముద్రితమై శంఖముతో సమానమైన కంఠమును, దృఢమై ఉభయవిభూతులను రక్షించదగినవై తనకు ఉభయవిభూతులను స్వాధీనపరచు దివ్యాస్త్రములచే పుష్పించినవో అనునట్లున్న విలక్షణమైన భుజములను, శ్రీమహాలక్ష్మీదేవికి అంతఃపురమై నిత్యము ననుభవించు చున్నను క్షణవిశ్లేషమును గూడ సహింపలేనంతటి వ్యామోహమును బుట్టించునదై, వనమాలా విరాజితమై, అమూల్యమగు మణిహార మౌక్తికహార కౌస్తుభాదుల కాకరమై ప్రకాశించుచున్న వక్షఃస్థలమును,

దివ్యమంగళవిగ్రహమునకు అలంకారమై సౌందర్య ప్రవాహమున కడ్డు గట్టుకట్టిరో యనునట్టున్న తెల్లని యజ్ఞోపవీతమును, నిత్యముక్తులయొక్క హృదయములయందు సౌందర్యమును గంతులిడ జేయుచున్న ఉదరబంధమును, సౌందర్యసాగరము ఇరుకు ప్రదేశమున పడి సుడితిరుగునట్లు మనస్సును నేత్రములను సుడిలో పడవేయుచున్న నాభియు, పాంచజన్యము, చక్రము చంద్రసూర్యులుగా దలంచి వికసించుచును ముకుళించుచునున్న బ్రహ్మకు స్థానమైన నాభికమలమును, సంధ్యారాగముచేత రంజితమైన ఆకాశమువలె నున్న నడుమునకు శోభనుకలుగజేయుచున్నదై నడుము పూచినదో అనునట్లున్న పీతాంబరమును, అరటిస్తంభములవలెనున్న గంభీరమైన తొడలును, తామరకాడవలె గగుర్పాటు గల పిక్కలును, శంఖ చక్ర కల్పక ధ్వజారవిందాంకుశ వజ్ర రేఖలచే చిహ్నితములై నాచ్చియారులు కూడ కందిపోవునో అను సందేహముతో స్పృశించవలసిన మిక్కిలి మృదువైన పాదములును, లావణ్యసాగరముయొక్క తరంగములో అనునట్లున్న వేళ్ళున్ను వానియందనేక చంద్రులుదయించెనో అనునట్లున్న నఖములును, వజ్రములనుగూడ కరగించు నదియై స్త్రీలను మర్యాదలను మీర జేయునదియై చూచినంతనే తాపము నుపశమింప జేయునదియై నల్లనై చల్లనై నిత్యసూరుల యొక్కయు మనోనేత్రములను ఆకర్షించునట్టియు, భక్తులకు జీవనౌషధమై, చాతుర్యమునకు నిలయమై, మనోరథములకు విషయమై వేదాంతవాక్యములకు సర్వస్వమై, దివ్యాత్మస్వరూపమునకు ప్రకాశకమై, ఆయుధాభరణ తేజఃప్రవాహమునందు ఊహించి గ్రహించవలసిన దైవ దివ్యమంగళవిగ్రహమును, సదా చూచుచుండు



నిత్యసూరుల చూపునుగూడ సహింపజాలని సౌకుమార్యమును కలదై శ్రీవైకుంతమునంత ఒక్క రీతిగ పరిమళింపజేయుచు కటాక్షామృతవర్షముచే నిత్య ముక్త దివ్యగోష్ఠిని పల్లవిత కుసుమితముగా ఒనర్చుచు ఉభయ విభూతు లను కూడా ఆసనా బలముచేత జయించి వేంచేసియుండును.

ఈ వైకుంతనాథుని సేవించునదెపుడో అనెడు ముక్తుని ఆర్తి తీరునటులగా కనులార సేవించి **"సమస్త పరివారాయ శ్రీమతే నారాయణాయ నమః"** అని సాష్టాంగ ప్రణామము నాచరించి ఆనందపరవశుడై పడుచు-లేచుచు, కూర్చుండుచు-పరుగిడుచు, నిరతిశయ ప్రీతితో నేగి పాదపీఠము నందు అడుగుపెట్టి దివ్యసింహాసనము అధిరోహించును. అంత ఆ సర్వేశ్వరుడు చంద్రుని జూచిన సముద్రమువలె ఉప్పొంగి తనను ఎడబాసి చాలదినములు భూమియందు పడియున్న కష్టము తీరునటుల తన తొడయందు భరతుని కూర్చుండబెట్టుకొనినట్లు ఈతని ఎత్తి ఒడియందుంచుకొని అక్రూరుని కౌగలించుకొనినట్లు కౌగలించుకొనును. అంత ముక్తేశ్వరులకు ఈవిధముగ సంభాషణ జరుగును.

శ్రియఃపతి - నాయనా! నీవు ఎవరవు?

ముక్తుడు - నేను నీకు శరీరమువలె ఆధేయమై, విధేయమై, ధార్యమై, శేషమైయున్న రాజకుమారుడను.

శ్రియఃపతి - నీవింత కాల మేమి జేసితివి?

ముక్తుడు - భోగలాలసుడనై, ఇంద్రియా రాముడనై ఆనంద సాగరాంతర్నిమగ్నుడనై ఉంటిని.

శ్రియఃపతి – నీకు దానిచే లభించిన ఫల మేమి?

ముక్తుడు – ఘోరమైన, క్రూరమైన నరకములయందు పడరాని క్లేశముల నన్నిటి అనుభవించితిని.

శ్రియఃపతి – పిమ్మట ఏమి చేసితివి?

ముక్తుడు – ఇదిగో, నీదరి చేరితిని గదా !

శ్రియఃపతి – దీనికి ఏమి ఉపాయము అవలంబించితివి?

ముక్తుడు – పుణ్యస్వరూపుడవగు నిన్నే.

శ్రియఃపతి – నన్ను సమీపించి నీవు పొందిన ప్రయోజన మేమి?

ముక్తుడు – నాయొక్క క్రూరమైన పాపములను పోగొట్టుకొంటిని, ఆనందమున కంతము లేని యీ దేశమునందు వర్తించితిని, అని విన్నవించగానే

**శ్రియఃపతి** – బాబూ! క్రూరమైన లోకములయందు చాల కాలము తల్లడించితివే, అనేక జన్మలయంద అనేక దుఃఖములను అనుభవించితివే అయ్యో! అవి అన్నియు నిస్సారములని నిశ్చయించి "శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే" అనిన తోడనే మేము నీకడకు వచ్చి ముఖమును కనబరచలేక పోతిమే! తలను పైకెత్తి, మేమున్న దేశమును లక్షించి ఏడ్చుచు నమస్కరించుచు 'దయామయా! నన్ను పిలుచుకొను కాల మింకను సమీపించదా! నిన్ను ఇక ఏనాడు వచ్చి కూడుదునని' నీవు బాధపడున ట్లాలసించితిమి!! దానికి మన్నింపుము. ఆ కష్టములన్నియు తీరునట్లుగా నీ వీనాడు మమ్ములను సమీపించితివి, నీ తాపము లన్నియు తీరినవి. మా సృష్ట్యాది వ్యాపారము లన్నియు సఫలమైనవి. మా కలభ్యలాభమైనది.



నీ రాకచే నీ దేశము సనాతనమైనది. ఈ నిత్య ముక్త గోష్ఠికి నీవు సమీపించి ఔజ్జ్వల్యము నాపాదించితివి. నాయనా! నడచివచ్చిన కాళ్లు నొచ్చినవా? అని వందిమాగధులవలెస్తోత్రము చేసి మనోహరములగు చాటువాక్యములచే ముక్తపురుషుని చల్లబరచును. వ్యాధిని విడచి ఆరోగ్య స్నానమును చేయించిన పుత్రుని తండ్రి చూచునట్లు చూచి తూమును తెరచి నీటిని ప్రవహింపజేయునట్లు తన పుండరీక దళాయ తేక్షణముల నుండి కటాక్ష అమృతమును ప్రవహింపజేయును. దారి పొడుగునను ముక్త పురుషుడు మనోరధించిన మనోరథముల నన్నింటిని సఫలపరచును, విడచి విడచి కౌగలించుకొనుచుండును. ఆహా ! ఇది చిత్త మోహమా? భ్రమయా? యని గొప్ప వ్యామోహమును చెంది పెరియపిరాట్టిమారులచేతి కందించును, ఆమె కంస వధానంతరము కృష్ణుని జూచిన దేవకీదేవికివలెనే ఉబ్బి ప్రవహించుచున్న స్తన్యముచేత వీని శరీరమును తడవుచు కౌగలించుకొనును. శ్రీ, నారాయణులు ఇరువురును తమ విభూత్యైశ్వర్యమును ఈతని కొసంగుదురు, అంత ఈ ముక్త పురుషుడు భగవంతుని ఒడినుండి దిగివచ్చి ముందున్న సౌందర్యమును అనుభవించి తట్టుకొన జాలక ప్రక్కల కేగియు, వెనుక కేగియు సౌందర్యానుభవముచే చంచల చిత్తవృత్తి గలవాడై శిరమున అంజలి జోడించి ఆశ్చర్యచకిత హృదయుడై మరియొక దానియందు మనస్సు వెళ్ళక "ఆహా! హూహా! హూహా!" అని సామగాన మొనరించును. ఆహా! నా భాగ్యమేమి శ్రియఃపతీ! నా తల్లితోకూడికొనియున్న నిన్ను ఈ అప్రాకృత దివ్య దేశమున నీ స్వస్థానమున సేవించగలిగితిని. నీ తిరువడినే ఆశ్రయించితిని, నన్ను నీ పాద ద్వంద్వములచెంత ఉంచుకొనుము స్వామీ! అని ప్రీతితో నోరార

నుతించును. శ్రీవైకుంఠనాధుడును చల్లని చూపులతో కటాక్షించి మందహాసముతో సుకుమారమైన తన పాద ద్వంద్వములను ఈతని శిరస్సున కలంకరింపజేయును. ఈతనిని తన నిత్య కైంకర్యమున నియోగించును. అంత నీ ముక్త పురుషుడు చరమ దేహముతో తాను ఆశించిన సర్వదేశ సర్వకాల సర్వావస్థలయందును సర్వేశ్వరుని సర్వవిధముల కైంకర్యములను చేయవలె ననెడి అభినివేశాతిశయముచే అనేక దేహములను పరిగ్రహించి సమస్త శేషవృత్తులయందు అన్వయించును, అవసరము లేకున్నను ప్రీత్యతిశయముచే భగవంతుని రక్షణయందు వ్యసనముగల నిత్యసూరులతో గూడియుండి భగవంతునకు నిత్య మంగళాశాసనమును గావించుచుండును, అమృతసాగరాంతర్ని మగ్నమైన సమస్తావయవములు గల వాడగుచు యావదాత్మభావిగా నటనుండి ఉత్తరోత్తరానందమును పొందుచుండును.

----